క్లుప్తంగా


అన్నపురెడ్డిపల్లి తహసీల్దార్‌గా ప్రసాద్



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రసాద్

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): అన్నపురెడ్డిపల్లి తహసీల్దార్‌గా జి.ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన పుల్లారావు రిటైర్ వ్వడంతో కొన్ని రోజులుగా పోస్టు ఖాళీగా ఉంది. ఈ మేరకు ప్రసాద్‌ను నియమించారు.

దోమల మందు పిచికారీ



పినపాక: మలేరియా, డెంగీ వంటి జ్వరాలు రాకుండా దోమల నివారణకు పాఠశాలల్లో దోమల మందు పిచికారీ చేస్తున్నామని డాక్టర్ స్మృతి తెలిపారు. ఈ మేరకు గురువారం మండలంలోని ఐలాపురం వద్ద ఉన్న కస్తూర్బా పాఠశాలలో పంచాయతీ సిబ్బంది దోమల మందు పిచికారీ చేశారు. దోమల నివారణకు తీసుకోవలసిన చర్యలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

అన్నదానం



మణుగూరు రూరల్ : మండలంలోని సమితిసింగారం సాయినగర్‌లో గల శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో సాయినాథుడికి గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మణుగూరుకు చెందిన రామసాని సిద్దార్థ్ బాబు సంధ్య దంపతులు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్.బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డు ప్రమాదాలకు టీజీఎండీసీదే బాధ్యత'

దుమ్ముగూడెం: భద్రాచలం డివిజన్‌లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, మరణాలకు టీజీఎండీసీదే బాధ్యతని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ విమర్శించారు. ఈ మేరకు గురువారం మంగవాయిబాడువాలో కొర్స చిలకమ్మ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గం ప్రధాన రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయని, ఇలాంటి పరిస్థితి ఎప్పుడు చూడలేదన్నారు. ప్రభుత్వానికి ఆదాయం మీద ఉన్న శ్రద్ధ ప్రజల ప్రాణాల మీద లేదన్నారు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులైన వారికి, మరణించిన వారి కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు శ్రీను, సారయ్య, కల్లూరు బాబురావు, రమేష్, సత్తిబాబు, నాగరాజు, జంపు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్చి నిర్మాణానికి శంకుస్థాపన



భద్రాచలంటౌన్: పట్టణంలోని వైఎస్సార్ నగర్‌లో నిర్మించనున్న స్వాగత ద్వారం(ఆర్చి) నిర్మాణానికి గురువారం కాలనీవాసులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు చేశారు. ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, కాలనీని అన్ని హంగులతో తీర్చిదిద్దాలనే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

దుకాణాల నిర్వహణకు నేడు వేలం

దుమ్ముగూడెం : మండలంలోని నర్సాపురం గ్రామంలోని శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ చిన్న అరుణాచలం దేవస్థానం దగ్గర సంవత్సరం పాటు దుకాణాల నిర్వహణకు శుక్రవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు శివనాగస్వామి తెలిపారు. ఈ నెల 22 నుండి వచ్చే ఏడాది అక్టోబర్ 22 వరకు పూజ సామగ్రి దుకాణం నిర్వహణకు వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు ఉదయం 11లోపు పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఇసుక ఊరికేం రాదు..

ఇందిరమ్మ ఇళ్లకు అందని 'ఉచిత ఇసుక'

- స్థానికంగా అందుబాటులో లేని రీచ్‌లు
- వివిధ దశల్లో బిల్లుల చెల్లింపులు ఆలస్యం



దమ్మపేటలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

దమ్మపేట: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ఉచితంగా అందాల్సిన ఇసుక మండలంలో అందని ద్రాక్షలా మారింది. ఇళ్ల నిర్మాణానికి స్థానికంగా ఉన్న ఇసుక రీచ్‌ల నుండి ఉచితంగా అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, మైనింగ్ సంస్థ గుర్తించబడిన ఇసుక రీచ్‌లు, కాల్వలు మండలంలో లేకపోవడంతో ఉచిత ఇసుక సాధ్యపడటం లేదు. మండలంలో ఇసుక వనరులు అందుబాటులో లేనందున సమీప మండలాల నుంచి ఇసుక తెచ్చుకోడానికి అధికారులు అనుమతులు ఇచ్చినా రవాణా చార్జీలకు భయపడి లబ్ధిదారులు సుముఖత వ్యక్తం చేయడం లేదు. దీంతో ఏపీ నుండి ఇసుక తెప్పించుకుని ఇంటి నిర్మాణాలకు ఉపయోగిస్తున్నారు. ఇటీవల ఏపీ నుండి వచ్చే ఇసుక ధరలు అమాంతం పెరగడంతో, అదనపు భారం పడుతుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుకయార్డు ఏర్పాటుచేయాలని..

మండలంలో ఇసుక వనరులు లేని కారణంగా స్థానికంగా ఇసుక యార్డు(బ్యాంకు)ను ఏర్పాటు చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా పరిధిలో ఉన్న ఇసుక రీచ్‌ల నుంచి సరిపడా ఇసుకను మండల కేంద్రంలో డంపింగ్ చేయించాలని కోరుతున్నారు. లబ్ధిదారులకు అవసరమైన ఇసుకను ఈ యార్డు నుండి కూపన్లతో తక్కువ ధరకు సరఫరా చేయాలని ఆశిస్తున్నారు. ఇలా చేస్తే అదనపు ఆర్థిక భారం కొంతమేరకు తగ్గే అవకాశం ఉందని, ఇసుక యార్డు ఏర్పాటు చేసి తక్కువ ధరకు ఇసుక సరఫరా చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

బిల్లుల చెల్లింపుల్లోనూ ఆలస్యం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎల్1, ఎల్2, ఎల్ 3 మూడు జాబితాలు తయారుచేసి మొదటి దశలో లబ్ధిదారుల జాబితాలో ఎల్ 3లో ఉన్న వారికీ ఇళ్లు మంజూరయ్యాయి. ఈ విధంగా మొదటి దశలో ఇళ్లు మంజూరైన ఎల్3 జాబితాలోని లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం జరుగుతుంది. బిల్లులు ఆలస్యం కావడంతో తదుపరి నిర్మాణ దశకు లబ్ధిదారులు ముందుకు వెళ్లలేకపోతున్నారు. బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరిగిన సందర్భాల్లో, సంబంధిత అధికారులు లబ్ధిదారుల అర్హత ప్రమాణాలను, ఇంటి నిర్మాణ దశ వివరాలను తగు రీతిలో పొందుపరిచి, ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. నివేదన రిపోర్టులు ఉన్నతాధికారులతో ఆమోదం పొందడానికి కొన్ని సందర్భాల్లో నెల వరకు సమయం పడుతుంది. దీంతో ఈ ఆలస్యం వెనుక కారణాలు ఏంటో తెలియక లబ్ధిదారులు ఆందోళన పడుతున్నారు.

తప్పని అదనపు భారం..

మండలపరిధిలో మొదటి దశలో మొత్తం 656 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా వీటిలో 601 మంది ఇప్పటికే నిర్మాణాలను వడివడిగా కొనసాగిస్తున్నారు. కాగా ఇసుకను ప్రభుత్వం ఉచితంగా కూపన్ల ద్వారా అందజేస్తామని ప్రకటించినప్పటికీ, స్థానికంగా ఇసుక వనరులు లేకపోవడంతో సమీప మండలం ములకలపల్లి నుంచి ఇసుకను తెచ్చుకోవడానికి కూపన్లను ఇప్పించడానికి ఎంపీడీఓ, తహసీల్దార్ సిద్ధంగా ఉన్నప్పటికీ, లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. మండలంకేంద్రం నుండి ములకలపల్లి 40 కిలోమీటర్ల ఉండటంతో రవాణా ఖర్చుకు భయపడి ఏపీ నుంచి తక్కువ ధరకు వస్తున్న ఇసుకను కొనుగోలు చేస్తుంన్నారు. ప్రస్తుతం ఏపీ ఇసుకకు కూడా ధర అమాంతంగా పెంచడంతో లబ్ధిదారులపై అదనపు ఆర్థిక భారం పడుతుంది.

తక్కువ ధరకు సరఫరా చేయాలి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను తక్కువ ధరకు లబ్ధిదారులకు అందించేలా ప్రభుత్వం చొరవ చూపాలి. దమ్మపేటలో నాకు మంజూరైన ఇంటి నిర్మాణానికి స్థానికంగా ఇసుక దొరకక దూరప్రాంతాల నుండి ఇసుకను కొనుగోలు చేశాను. దీంతో ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చులు పెరిగిపోయి మాపై అదనపు భారం పెరిగి, ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– కట్ల వెంకటరమణ, లబ్ధిదారురాలు, దమ్మపేట

స్థానికంగా లభ్యత లేదు



మండలంలో మైనింగ్ సంస్థ ధ్రువీకరించబడిన ఇసుక వనరులు లేకపోవడంతో లబ్ధిదారులకు ఇసుకను అందించే పరిస్థితి లేదు. లబ్ధిదారులు ఆసక్తి చూపితే సమీప మండలం నుండి ఇసుకను అందించేలా చూస్తాం. ఎల్3 జాబితా నుండి ఎల్1కి వచ్చిన వారి వివరాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందజేస్తూ, బిల్లుల చెల్లింపుల విషయంలో ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం.

– భీంరెడ్డి రవీంద్రారెడ్డి, ఎంపీడీఓ, దమ్మపేట

కమిటీ ఎన్నిక

మణుగూరు రూరల్ : మండల కేంద్రంలోని సురక్షా బస్టాండ్ అడ్డా ఆటో యూనియన్ (ఏఐటీయూసీ) నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఎం ఏ.రాజు, కార్యదర్శిగా మందార పుల్లయ్య, గౌరవాధ్యక్షుడిగా వీరాచారిలను ఎన్నుకుని సన్మానించారు. అనంతరం సీపీఐ జిల్లా మహిళా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ మాట్లాడుతూ... ఆటో కార్మికులంతా ఐక్యంగా ముందుకు సాగాలని, బీసీ రిజర్వేషన్ అమలుకు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు రాయల భిక్షం, గౌరవాధ్యక్షుడు తోట రమేష్, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, శంకర్, రాజేష్, నరేష్, నరసింహారావు, నవీన్, అశోక్, సతీష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయకుంటే ఆందోళనలు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: ధ్వంసమైన జాతీయ రహదారి పునర్నిర్మాణానికి అఖిలపక్షం ఆధ్వర్యంలో మరో ఉద్యమానికి సీపీఎం సిద్ధంగా ఉందని, కలిసొచ్చే పార్టీలతో రోడ్డు నిర్మించే వరకు నిరంతరాయ ఉద్యమాలు చేస్తామని, ఇసుక లారీలను రోడ్లు బాగు చేయకుండా మళ్లీ అనుమతిస్తే సడక్ బంద్ నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్ ఆవరణలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు వివిధ రాజకీయ పక్షాలు ఎవరికి వారుగా పలు రూపాల్లో ఉద్యమాలు నిర్వహించారని పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకోలు, పాదయాత్రలు, నిర్వహించినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు గాని స్పందించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో మరో ఉద్యమానికి పార్టీ శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేపాకుల శ్రీనివాస్, గడ్డం.స్వామి, యం.చంద్రయ్య, ఎలమంచిలి వంశీకృష్ణ, మచ్చ రామారావు, సీఐటీయూ పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించాలి

మణుగూరు టౌన్/ మణుగూరు రూరల్: రేపు (శనివారం) నిర్వహించే రాష్ట్రబంద్‌కు అన్ని వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని బీసీ జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం ఇన్‌చార్జి సోమేశ్వర్ గౌడ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీవి, సాంబశివరావు, నాగారపు సతీష్, బింగి రమాదేవి, బెక్కం జయమ్మ, బొల్లు నర్సమ్మ, తదితరులు పాల్గన్నారు.

సీపీఐ మద్దతు..

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాలు 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని బంద్‌కు వ్యాపార వర్గాలు, వాణిజ్య విద్యాసంస్థలు సహకరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో మండల, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జక్కుల రాజబాబులు మాట్లాడుతూ... రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన బీసీలు, రిజర్వేషన్‌లు లేకపోవడంతో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా కొన్ని కులాలు వెనుకబడి ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాయల భిక్షం, తోట రమేష్, కొత్తపల్లి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై మాట్లాడడం హాస్యాస్పదం

గుండాల: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ నాయకులు ఎస్‌కె. అబ్దుల్ నబి అన్నారు. మండలకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీ ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అటు హైకోర్టు, సుప్రీం కోర్టులో కొట్లాడుతుండడం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీలకు కార్యాలయాలు లేక పాలన అస్తవ్యస్తంగా మారితే విడుతల వారిగా నూతన కార్యాలయాలు నిర్మాణం చేపట్టారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అప్పులు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు తీరుస్తూ సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. ఎస్‌కె. ఖాసీం, గడ్డం రాజేష్ పాల్గొన్నారు.

కుంగిన లో లెవల్ చప్టా..

- మరమ్మతులు చేపట్టి ఏడాదైనా పూర్తి కాని వైనం



చప్టా కుంగి గుంత పడిన దృశ్యం

అశ్వారావుపేటరూరల్: నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై ఉన్న లో లెవల్ చప్టా కుంగి ప్రమాదకరంగా మారింది. మండలంలోని వినాయకపురం–దబ్బతోగు మార్గంలో వాగుపై ఉన్న లో లెవల్ చప్టా ఇటీవలె కురిసిన భారీ వర్షాలతో కుంగి పెద్ద గుంత ఏర్పడింది. చిన్నపాటి వర్షానికే ఈ చప్టాపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండగా, వాహనదారులు ఏళ్లుగా అవస్థలు పడుతున్నారు. గతేడాది ఈ చప్టాకు గండి పడటంతో రోడ్లు భవనాల శాఖ అధికారులు రూ.లక్షల వ్యయంతో మరమ్మతులు చేయించారు. ఏడాది దాటకముందే మళ్లీ కుంగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రి వేళలో గుంత కనపడక ప్రమాదాల బారిన పడుతున్నామని, మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. దీనిపై స్థానిక ఆర్ అండ్‌బీ డీఈఈ ప్రకాశ్ వివరణ కోరగా.. చప్టా కుంగిన విషయం వారి దృష్టికి వచ్చిందని, వారంలో మరమ్మతులు చేపడతామన్నారు.

అంకితభావంతో వైద్య సేవలందించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న చైతన్య

కరకగూడెం: వైద్య సిబ్బంది అంకితభావంతో సేవలందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చైతన్య అన్నారు. ఈ మేరకు గురువారం కరకగూడెం పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి, చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. ల్యాబ్, ఫార్మసీ, మందుల నిల్వలను పరిశీలించి మందుల సరఫరా, పరికరాల లభ్యతపై సమీక్ష నిర్వహించారు. సిబ్బంది విధి నిర్వహణ, పరిశుభ్రత,రోగుల సేవలో మరింత జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రసవాల సంఖ్యను పెంచాలని, ప్రతీ నెల నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. ఈ వైద్యాధికారి రవితేజ, సీహెచ్‌ఓ శ్రీనివాస్, హెచ్‌ఈఓలు గొంది వెంకటేశ్వర్లు, పోలెబోయిన కృష్ణయ్య, ఫార్మసిస్ట్ సునీల్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో సర్వే నంబరు 1228లో కెమిలాయిడ్స్ గెస్ట్‌హౌస్ సమీపంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన సుమారు 150 గృహాలను స్వచ్ఛందంగా తొలగించాలని తహసీల్దార్ రామకృష్ణ సూచించారు. ఈ మేరకు గురువారం గృహాల వద్దకు పోలీసులతో ఆయన వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం అశ్వారావుపేటకు మంజూరు చేసిన యంగ్ ఇండియా స్కూల్ కోసం కేటాయించిన 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో సుమారు 2.5 ఎకరాల్లో అక్రమంగా షెడ్లు, గుడిసెలు నిర్మించారని, వారు నిర్మాణాలు తొలగించాలని, లేని పక్షంలో ఏ క్షణానైనా తొలగిస్తామని హెచ్చరించారు.

గ్రంథాలయానికి స్థలం కేటాయింపు



స్థలం కొలతలు వేయిస్తున్న వీరబాబు, నాయకులు

దమ్మపేట: మండల కేంద్రంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించినట్లు జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి కేటాయించిన భూమి కొలతలు తీసుకున్నారు. దమ్మపేటలో ప్రధాన రహదారి పక్కనే ఆర్‌అండ్‌బీ ఆధీనంలో ఉన్న మూడు కుంటల భూమిని గ్రంథాలయానికి కేటాయించారని, త్వరలోనే భవన నిర్మాణం చేపట్టే దిశగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నశెట్టి యుగంధర్, కక్కిరాల రమేష్, చిన్నశెట్టి చిట్టిబాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వంగడాలు వాడాలి



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

ములకలపల్లి: పంటల సాగులో అధిక దిగుబడిని సాధించడానికి నాణ్యమైన వంగడాలనే వాడాలని ప్రోగ్రాం కో ఆర్డినేటర్ టి.భరత్ సూచించారు. 'నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తం' కార్యక్రమంలో భాగంగా మండలపరిధిలోని సూరంపాలెం గ్రామంలో గురువారం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ హేమచంద్ర, ఎంఏఓ అరుణ్‌బాబు, ఏఈఓ బి. రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో వైద్యశిబిరం



ఆరోగ్య సూత్రాలను విద్యార్థులకు వివరిస్తున్న డాక్టర్ దివాకర్

దమ్మపేట: మండలంలోని అంకంపాలెం గిరిజన బాలికల గురుకుల కళాశాలలో పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యులు దివాకర్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, పలువురికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పకుండా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుల్లమ్మ, ఆస్పత్రి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజానికి 'చైతన్యం'



అశ్వారావుపేట: అవగాహన కల్పిస్తున్న సీఐ నాగరాజు



బూర్గంపాడు: మాట్లాడుతున్న ఎస్సై ప్రసాద్



ములకలపల్లిలో..

అశ్వారావుపేట: మాదక ద్రవ్యరహిత సమాజం కోసం 'చైతన్యం' అనే కార్యక్రమానికి ఎస్పీ రోహిత్ రాజ్ సూచనల మేరకు శ్రీకారం చుట్టినట్లు సీఐ పింగళి నాగరాజురెడ్డి అన్నారు. గురువారం అశ్వారావుపేటలో చైతన్యం కార్యక్రమాన్ని ప్రారంభించి రింగ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాదక ద్రవ్యాల వినియోగంపై అనర్థాలను వివరించారు. నెల రోజులపాటు మండలంలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఎవరైనా గంజాయి తరలిస్తున్నా, విక్రయిస్తున్నా, సేవిస్తున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రామ్మూర్తి, అఖిల, సిబ్బంది పాల్గొన్నారు.

● మత్తు పదార్థాలను దరిచేరనివ్వొద్దు

బూర్గంపాడు: విద్యార్థులు మత్తుపదార్థాలను దరిచేరనీయవద్దని బూర్గంపాడు సీఐ మేడ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. జీవితంలో ఉన్నతంగా ఎదగాలంటే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ సేవించిన, విక్రయించిన కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ప్రిన్సిపాల్ చీన్యా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్సై నాగభిక్షం, అధ్యాపకులు నాగేశ్వరరావు, శ్రీనివాస్, పిచ్చయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

● చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ములకలపల్లి: యువత మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఎస్.మధుప్రసాద్ అన్నారు. 'చైతన్యం – డ్రగ్స్‌పై యుద్ధం' కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో మాదక ద్రవ్యాల రహిత సమాజానికి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అతహర్ అలీ, సీహెచ్. రాజేశ్వరి, బి. కుమారస్వామి, చంద్రమౌళి, టి. సుధాకర్, కే. సతీష్‌కుమార్, స్టూడెంట్ కౌన్సిలర్ పి. రామకృష్ణ పాల్గొన్నారు.

● చదువుపై శ్రద్ధ పెట్టాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పట్టణ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు నిషేధిత అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై తిరుపతి మాట్లాడుతూ.. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్, ప్రసాద్, రమేష్, సుధాకర్ రావు, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● మాదకద్రవ్యాలపై పోరాటం

దుమ్ముగూడెం: మాదకద్రవ్యాలపై పోరాటంలో భాగంగా దుమ్ముగూడెం పోలీసుల ఆధ్వర్యంలో ఆర్లగూడెం ఆశ్రమ పాఠశాలలో మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై గణేష్ మాదక ద్రవ్యాల వాడకంతో వచ్చే ఆరోగ్య సమస్యలు, చట్టపరమైన పరిణామాలు వివరించారు. మాదక ద్రవ్యాల వ్యాపారం, వాడకం తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

● మత్తుకు బానిసలు కావొద్దు

దమ్మపేట: గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసగా మారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్సై సాయి కిషోర్ రెడ్డి సూచించారు. మండలంలోని మందలపల్లి క్రాస్ రోడ్డు వద్ద మత్తు పదార్థాల నిర్మూలనపై స్థానికులకు అవగాహన కార్యక్రమం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణాపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఎవరైనా అక్రమంగా నిషేధిత గంజాయిని రవాణా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే టపాసుల దుకాణాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. అదనపు ఎస్సై బాలస్వామి తదితర సిబ్బంది పాల్గొన్నారు.



దమ్మపేటలో..



భద్రాచలంటౌన్: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు..



దుమ్ముగూడెం: అవగాహన కల్పిస్తున్న ఎస్సై గణేష్